DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
గురువారం, నవంబరు 23, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## గచ్చిబౌలిలో రూ. 5 కోట్లు నగదు పట్టివేత



హైదరాబాద్ (వాయిస్ టుడే): ఎలక్షన్ కోడ్‌లో భాగంగా నగరంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పోలీసులు భారీగా నగదు పట్టుకున్నారు. కొండాపూర్ బొటానికల్ రోడ్డు నుంచి చిరెక్ పబ్లిక్ స్కూల్ పైపు బ్రీజా కార్లో గుర్తుతెలియని వ్యక్తులు నగదును తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే పోలీసులు రంగంలోకి దిగి అటుగా వెళ్తున్న కారును తనిఖీ చేశారు. ఆ కారులో రెండు సంచుల్లో ఐదు కోట్ల రూపాయలను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించి ఆ నగదును సీజ్ చేశారు. వారి దగ్గరి నుంచి రూ 5 కోట్ల నగదు, మూడు సెల్ ఫోన్స్ , ఒక కారును మాదాపూర్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నగదు కాంగ్రెస్ నాయకుడికి సంబంధించినదిగా తెలుస్తోంది. ఆ నగదును ఐటీ శాఖ అధికారులకు పోలీసులు అప్పగించారు. ముగ్గురు వ్యక్తులను గచ్చిబౌలి పోలీసులు అదుపులో తీసుకున్నారు.



## కుటుంబ పాలన వల్ల ఎలాంటి ప్రగతి లేదు

**బీజేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా**

నిజామాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణలో కుటుంబ పాలన వల్ల ఎలాంటి ప్రగతి లేదని బీజేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. గురువారం నాడు నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో జేపీ నడ్డా మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ గెలిస్తే తెలంగాణ ముఖచిత్రం మారిపోతుందని హామీ ఇచ్చారు. కేసీఆర్ తన కుటుంబాన్ని పైకి తేవడం తప్ప తెలంగాణ సమాజానికి చేసింది ఏమీలేదని మండిపడ్డారు. కుటుంబ పాలన వల్ల ఎలాంటి ప్రగతి ఉండదని, తెలంగాణ ప్రగతి వెనుకబడి పోయిందని అన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో కుటుంబ పాలన సాగుతోందన్నారు. ఇది కేసీఆర్ కుటుంబంతోనే కాదు దేశంలోని కుటుంబ వారసత్వ పాలకులపై పోరాటం చేస్తామని జేపీ నడ్డా హెచ్చరించారు.

# తెలంగాణ మీద కేసీఆర్‌కు ఉన్నది మమకారం..అహంకారం కాదు

**మార్పు కావాలి కాబట్టే 2014లో తెలంగాణ తెచ్చుకున్నాం**

**2004 నుంచి 2014 వరకు చావగొట్టింది కాంగ్రెస్**

**అహంకారం ఉన్నది ఈ దేశంలో కాంగ్రెస్ ఢిల్లీ దొరలకే**

**రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ మీద కేసీఆర్‌కు ఉన్నది మమకారమని, అహంకారం కాదని అన్నారు రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజల నాడి తెలిసిన నేత కేసీఆర్ అని చెప్పారు. టీవీ9 మెగా కాన్ క్లేవ్ లో పాల్గొన్న మంత్రి పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ రికార్డు సృష్టిస్తారని అన్నారు. తెలంగాణ సమాజం రాష్ట్రంలో మార్పు కోరుకోవట్లేదు. కేసీఆర్ పట్ల ప్రజలకు ప్రేమ ఉంది. తెలంగాణ సాధించిన నాయకుడిగా ఆయన పట్ల ప్రజల్లో ఆరాధనా భావం ఉంది. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలిచి మూడోసారి హ్యాట్రిక్ సీఎం అవుతారు. నిజం చెప్పాలంటే 2014లోనే రాష్ట్రంలో మార్పు వచ్చింది. ఇప్పుడు ప్రత్యేకంగా మార్పు కావాలని కోరుకుంటున్నది రాజకీయ నిరుద్యోగులే. ప్రజలు కాదు. వారు మంచి పనులు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నారని చెప్పుకొచ్చారు.

చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చేంత మమకారం ఉన్న వ్యక్తి కేసీఆర్. మమ్మల్ని చావచితకొట్టిందే కాంగ్రెస్. 55 ఏండ్లపాటు అహంకారంతో ఢిల్లీ పెత్తనం రుద్ది 55 ఏండ్లు వందల మందిని చంపి ఉద్యమ కారులను పొట్టనపెట్టుకున్న కాంగ్రెస్ వచ్చి ఇవాళ దొరల తెలంగాణ కావాలా, ప్రజల తెలంగాణ కావాలా అంటే ఏమన్నట్లు. నవంబర్ 30 నాడు జరిగే ఎన్నిక వెయ్యి శాతం ఢిల్లీ దొరలకు, ప్రజలకు మధ్య జరిగే ఎన్నిక. ఢిల్లీ దొరలు అని నేను ఆశామాషీగా అనట్లేదు. 1952లో ఇడ్లీ సాంబార్ ఉద్యమం అని మొదలుపెడితే ఐదుగురు పిల్లలను చంపిందే కాంగ్రెస్. 1956లో ఆంధ్రతో తెలంగాణకు ఇష్టం లేని పెండ్లి చేసిందే కాంగ్రెస్. 1968లో 378 మందిని పొట్టన పెట్టుకున్నదే కాంగ్రెస్. 1971లో 11 మంది ఎంపీలను తెలంగాణ ప్రజలు గెలిపిస్తే కర్కశంగా వాళ్లను, ప్రజాకాంక్షను తుంగలో తొక్కి కాంగ్రెస్‌లో కలుపుకున్నది ఇదే ఢిల్లీ దొరలు. 2004 నుంచి 2014 వరకు చావగొట్టింది కాంగ్రెస్. అహంకారం అంటూ ఉన్నది ఈ దేశంలో ఎవరికైనా అంటే అది కాంగ్రెస్‌కు ఢిల్లీ దొరలకే. మార్పు కావాలి కాబట్టే 2014లో తెలంగాణ తెచ్చుకున్నాం. 14 ఏళ్లు పోరాడి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. తెలంగాణ రాకతోనే మార్పు వచ్చేసిందని చెప్పుకొచ్చారు.

## కేసీఆర్‌కు కూడా చర్లపల్లి జైలులో డబుల్‌బెడ్ రూం కట్టిస్తా..!



సిద్దిపేట (వాయిస్ టుడే): దుబ్బాకకు రావలసిన నిధులు మామ అల్లుళ్లు సిద్దిపేటకు తరలించుకు పోయింద్రని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావుపై ఆరోపించారు. గురువారం దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ విజయభేరీ సభలో రేవంత్ మాట్లాడారు. మూడేండ్లలో రఘునందన్ రావు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట తప్పిన బీజేపీ ఎమ్మెల్యేకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. బీజేపీ రాజకీయ కుమ్ములాటల్లో రఘునందన్ మునిగిపోయారని అన్నారు. కేసీఆర్ కుటుంబానికే బంగారు తెలంగాణ అని, ప్రజలకు బొందల తెలంగాణగా మారిందని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను బక్కోన్ని అని అంటున్నాడు కేసీఆర్. బక్కోనికి బుక్కెడు బువ్వ, రెండు పెగ్గుల మందు కావాలి. కానీ 10 వేల ఎకరాలు మింగినవ్. ఆ పక్క హరీశ్ రావు, మరోపక్క కేటీఆర్ ఉండి దుబ్బాకను ఎందుకు బంగారు తునుక చేయలేదు" అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500 లేకే గ్యాస్ సిలిండర్,

- 2వ పేజీలో

## కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్ల గ్యారెంటీగా చీకటి రాజ్యమే : సీఎం కేసీఆర్



వికారాబాద్ (వాయిస్ టుడే): మెతుకు ఆనంద్ గర్వం లేని మనిషి.. నిగర్వి, నిత్యం ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి అని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసించారు. వికారాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని, మెతుకు ఆనంద్‌కు మద్దతుగా ప్రసంగించారు.

మెతుకు ఆనంద్ ఇక్కడే ధరూర్ మండలంలో పుట్టిన వ్యక్తి. సామాన్య కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకుని డాక్టర్ అయిన వ్యక్తి. మీ అందరికి తెలుసు. ఆయన భార్య సబిత కూడా డాక్టరే. ఇద్దరు ఇక్కడే ఉండి ప్రజా సేవలో ఉంటారు. వాళ్లు ఎవరి తెరుగు పోరు. నిగర్వి, గర్వం లేని మనిషి. అందరిలో కలిసి ఉండి గ్రామాలు తిరిగి వీలైనంత వరకు తనకు దేవుడిచ్చిన శక్తిని ఉపయోగించి ప్రజలకు సేవ చేయాలని ఆలోచించే వ్యక్తి. వికారాబాద్ బాగుపడతది ఆయన గెలిస్తే. ఇక్కడ ఏ ఎమ్మెల్యే గెలుస్తడో హైదరాబాద్‌లో అదే గవర్నమెంట్ వస్తది. ఎవరి చేతిలో ఉంటే ఈ రాష్ట్రం బాగుంటది. ధరణి ఊడగొడుతాం. రైతుబంధు తప్పు, 3 గంటల కరెంట్ ఇస్తం అనేటోళ్లు కరెక్టా..? లేదు అన్ని విధాలా మీ వెంట ఉంటాం అని చెప్పెటోళ్లు కరెక్టా..? మీరు ఆలోచించాలి అని కేసీఆర్ సూచించారు.

10 హెచ్‌పీ మోటారు పెడుతామని, బాధ్యతరాహిత్యంగా మాట్లాడుతున్నారు కాంగ్రెసోళ్లు. 10 హెచ్‌పీ మోటార్లు పెట్టి, అందరూ ఒకటేసారి వత్తుతే ట్రాన్స్ ఫార్మలు ఉంటాయా..? పటాకులు పేలినట్లు పేలిపోతాయి. సబ్ స్టేషన్లు కూడా పేలిపోతాయి. కాంగ్రెస్ గెలిస్తే గ్యారెంటీగా మళ్ల చీకటి రాజ్యమే వస్తది. కర్ణాటక మీకు దగ్గరనే ఉంటది. అక్కడ కరెంట్ 20 గంటలు ఇస్తమని నరికారు.. కానీ ఐదు గంటలు కరెంట్ ఇస్తున్నరు. హైదరాబాద్‌కు వచ్చి వాళ్లు ధర్నా చేస్తున్నారు. మేం కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయాం. మీరు కూడా మోసపోవద్దని కర్ణాటక రైతులు చెబుతున్నారు. కాబట్టి దచయేసి విద్యావంతుడు, బుద్ధిమంతుడు, నాకు దగ్గరి మనిషి ఆనంద్‌ను గెలిపించాలని కోరతున్నా అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.




# పవన్ మ్యానియా తెలంగాణలో పని చేస్తుందా..?

**పవన్ ఎంట్రీతో సెటిలర్ల ఓట్లు బీజేపీ వైపు మల్లుతాయా..?**

తెలంగాణ ఎన్నికల రణరంగంలోకి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా దూకారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న జనసేనాని.. రెండు పార్టీల అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారు. వరంగల్ జిల్లా నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. తెలంగాణలో అవినీతి పాలన నడుస్తుందని, ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదని బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు జనసేనాని. ఐతే ప్రచారం చేసినంత మాత్రాన పవన్.. స్టార్ ఇమేజ్ తెలంగాణలో పని చేస్తుందా..? ఎన్నికల్లో ఓట్లు కురిపిస్తాయా అనే చర్చ జరుగుతోంది. జనసేనతో బీజేపీ పొత్తు వ్యూహం ఫలిస్తుందా..? పవన్ సపోర్ట్, ప్రచారం ఎన్నికల్లో బీజేపీకి ఏ మేరకు ఉపయోగపడుతుంది అనేది ఆసక్తిగా మారింది. సినిమాలో స్టార్ ఇమేజ్ ఉన్న హీరో. కానీ ఆ ఇమేజ్ ఎన్నికలకు వచ్చే వరకు ఓట్లుగా మారుతాయా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ఏపీలో బీజేపీతో పొత్తులో ఉన్న పవన్ కళ్యాణ్‌ను తెలంగాణ ఎన్నికల్లోనూ రంగంలోకి దింపింది తెలంగాణ బీజేపీ. పవన్ అభిమానులతో పాటు.. జనసేన కేడర్, ఆంధ్రా సెటిలర్ల ఓట్లను దృష్టిలో పెట్టుకుని జనసేనతో పొత్తు మంతనాలు నడిపింది. జనసేనకు 8స్థానాలు ఇచ్చి.. మిగతా స్థానాల్లో బీజేపీకి సపోర్ట్ చేయాలని కోరింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. ఎక్కువగా ఏపీపైనే దృష్టి పెట్టారు. జనసేనకు తెలంగాణలో పెద్దగా కేడర్ కానీ, లీడర్లు కానీ లేరు. కానీ అభిమానులు ఎక్కువగా ఉండటంతో.. కొంత వరకైనా అది ఓటు బ్యాంకుగా మారుతుందనే ఆశతో బీజేపీ పొత్తు పెట్టుకున్నట్టు తెలుస్తోంది. కానీ సినిమాలు వేరు, రాజకీయాలు వేరు. ఏపీలోనే పవన్ సినిమా ఇమేజ్ పెద్దగా పని చేయలేదు. కేవలం జనసేన ఒక్కటి అంటే ఒక్క సీటే గెలిచింది. పవన్ రెండు చోట్లా పోటీ చేస్తే.. రెండు చోట్లా ఓడిపోయారు. అలాంటిది తెలంగాణలో పవన్ ఇమేజ్ పని చేస్తుంది అనుకోవడం, అభిమానుల రూపంలో ఓట్లు పడతాయి అనుకోవడం అత్యాశే అవుతుందని చెప్పాలి. తెలంగాణలో పవన్‌ను ఒక్క సినిమా నటుడిగానే చేస్తున్నారు. తప్ప ఆయనను నాయకుడిగా గుర్తించడం లేదని పొలిటికల్ సర్కిల్‌లో జరుగుతున్న చర్చ. పవన్ ను చూడడానికి జనం వస్తారు కానీ అవి అన్నీ ఓట్లుగా మారుతాయని అనుకోలేమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణలో నిన్నటి వరకు పవన్ యాక్టివ్ పాలిటిక్స్‌లో లేరు. అసలు ఎన్నికల్లో పోటీ చేద్దామనే ఉద్దేశంలో కూడా కనిపించలేదు. కేలవం బీజేపీ ఒత్తిడి మేరకు పవన్ తెలంగాణ ఎన్నికల్లో పోటీకి ఒప్పుకున్నట్టు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఓట్లు వచ్చే నేతను.. తెలంగాణ ప్రజలు నమ్ముతారని, అభిమానాన్ని క్యాష్ చేసుకుని ఓట్లు రాల్చుకుందామనికున్న బీజేపీ ఎత్తుగడ పెద్దగా పనిచేయక పోవచ్చనే భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

## కేసీఆర్ ఉద్యోగాలు భర్తీ చేస్తానని.. మాట తప్పాడు

**పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి**



కామారెడ్డి జిల్లా: సీఎం కేసీఆర్ ఉద్యోగాలు భర్తీ చేస్తానని.. మాట తప్పాడని పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం నాడు ఆయన కామారెడ్డి జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..."పదేళ్ల క్రితం సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేర్చలేదు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని సీఎం కేసీఆర్ మాట తప్పడు. దేశంలోనే సచివాలయానికి పోకుండా ఇంటి నుంచి పని చేసే ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ మాత్రమే. ఉద్యోగాలు భర్తీ చేస్తా అని మాట తప్పి, నిరుద్యోగ భృతిని ప్రకటించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తాం" అని నారాయణస్వామి పేర్కొన్నారు.



## పవన్ కల్యాణ్ వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

**తనిఖీకి సహకరించిన జనసేనాని**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. పెనుబల్లి వద్ద పవన్ కల్యాణ్ కాన్వాయ్‌ను ఆపిన పోలీసులు వాహనాలన్నింటిని తనిఖీ చేశారు. పోలీసుల తనిఖీకి పవన్ కల్యాణ్ సహకరించారు. విజయవాడ నుంచి వాహనాల్లో బయలుదేరిన పవన్ కల్యాణ్ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు కొత్తగూడెం వెళ్తున్నారు. ఈసందర్భంగా ఆయన వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.



# కేసీఆర్‌కు కూడా చర్లపల్లి జైలులో డబుల్‌బెడ్ రూం కట్టిస్తా..!

(మొదటి పేజీ తరువాయి)

ఆడపిల్ల పెళ్లికి లక్ష రూపాయలు, తులం బంగారం, వ్యవసాయానికే కాదు గృహావసరాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా అందజేస్తామన్నారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు రాదని కేసీఆర్ చెబుతున్నారని... కేసీఆర్ మతిపోయి మాట్లాడుతుండో.. మందేసి మాట్లాడుతుందో తెలియడం లేదని విరుచుకుపడ్డారు. రైతుకే కాదు.. భూమి లేని పేదలకు కూడా రూ.12000 రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యకు రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. ఈ నెల కేసీఆర్ ఉంటే 2 వేలే అని.. వచ్చేనెల కేసీఆర్ సర్కారును బొంద పెడితే రూ.4 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్‌కు కూడా చర్లపల్లి జైలులో డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తానని సెటైర్ విసిరారు. కేసీఆర్‌తో పాటు ఆయన కొడుకు, బిడ్డ ఉండడానికి ఖచ్చితంగా ఇలు కట్టిస్తానన్నారు. కేసీఆర్ దోచుకున్న లక్ష కోట్లు కక్కిస్తానని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.







# 'చెప్పుతో కొడతాం వెళ్లిపోండి'.. బీఆర్ఎస్ అభ్యర్థికి మహిళల వార్నింగ్

హైదరాబాద్ (వాయిస్ టుడే): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాష్ గౌడ్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజేంద్రనగర్ వెళ్లిన ప్రకాష్‌గౌడ్‌ను మహిళలు అడ్డుకున్నారు. తమ కాలనీలో సమస్యలు తీర్చకుండా ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడగడానికి వచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "చెప్పుతో కొడతాం వెళ్లిపోండి" అంటూ బీఆర్ఎస్ అభ్యర్థిపై మహిళలు మండిపడ్డారు. మహిళల నిరసనలతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ షాక్ అయ్యారు. ఇక చేసేదేమీ లేక బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రచారం చేయకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు.

# తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



రంగారెడ్డి జిల్లా (వాయిస్ టుడే): తెలంగాణ అధికారంలోకి రావడం ఖాయమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. మహేశ్వర నియోజకవర్గం, తుప్పగూడలో జరిగిన పార్టీ బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షాల భూటకపు మాటలను తిప్పి కొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు భట్టి విక్రమార్క పిలుపిచ్చారు. తెలంగాణ ఆర్థిక పరంగా బలమైన రాష్ట్రం అయినందున సుభిక్షమైన పాలన అందించాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తర్వాత పార్టీ అభ్యర్థి కేఎల్ఆర్ మాట్లాడతూ మహేశ్వరంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కేఎల్ఆర్‌ను ఎమ్మెల్యేగా గెలుపించుకుంటే అందరికీ మేలు జరుగుతుందని పలువురు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

# ఆర్మూర్‌లో కవిత కారును తనిఖీ చేసిన ఈసీ



నిజామాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కారును ఎన్నికల కమిషన్ అధికారులు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా కవిత ప్రయాణిస్తున్న కారును ముబారక్ నగర్ వద్ద తనిఖీ చేశారు. ఆమె ఆర్మూర్‌కు ఎన్నికల ప్రచారం కోసం వెళ్తున్నట్లు తెలుస్తోంది. కారులో నుంచి దిగి తనిఖీలకు కవిత సహకరించారు. కారును అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలకు సహకరించినందుకుగానూ ఎమ్మెల్సీ కవితకు పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి

## సూర్యాపేట ఎన్నికల ప్రచారంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్



సూర్యాపేట: అన్నిరంగాల్లో వెనుకబడిన తెలంగాణలో ధర్మయుద్ధం చేద్దామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. గురువారం నాడు సూర్యాపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జై తెలంగాణ అంటూ పవన్ కళ్యాణ్ ప్రసంగం ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.."నిధులు, నియామకాలు, నీళ్లపై తెలంగాణ ఉద్యమం జరిగితే ఫ్లోరోసిస్ సమస్యతో ఇబ్బంది పడ్డ నల్లగొండ జిల్లానే జనసేన పార్టీ ఆవిర్భావానికి స్ఫూర్తి. తెలంగాణలో బీసీలు రాజ్యాధికారం దిశగా ప్రయత్నం చేయాలి. మోదీ నాయకత్వంలో దేశంలో అందరికీ సమానత్వం అనే నినాదంతో పాలన సాగుతుంది. జనసేన మనస్ఫూర్తిగా బీజేపీకి మద్దతిస్తుంది" అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

### తెలంగాణలో ఆడపడుచుల అదృశ్యం

"తెలంగాణలో ఆడపడుచులు ఎక్కువగా అదృశ్యం అవుతున్నారు. మహిళలపై ఆగడాలు ఎక్కువయ్యాయి. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి, ఆదిశగా జనసేన కృషి చేస్తోంది. తెలంగాణ యువత పోరాట స్ఫూర్తితో ఆంధ్రాలో పోరాటం చేస్తున్నాను. జన్మనిచ్చిన తెలంగాణకు సేవ చేయాలనే వచ్చాను. జిల్లాలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి" అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.



# అరాచక పాలనపై తీర్పు ఇచ్చే సమయం ఆసన్నమైంది

హనుమకొండ (వాయిస్ టుడే): అరాచక బీఆర్ఎస్ పాలనపై తీర్పు ఇచ్చే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ మహిళా నేత విజయశాంతి అన్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి తరపున విజయశాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడారు. "భూ, మైనింగ్ మాఫియాను కేసీఆర్ ప్రోత్సహించారు. ప్రాజెక్టుల పేరుతో అవినీతి చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం పేరుతో అవినీతికి పాల్పడ్డారు. టీఎస్‌పీఎస్ పేపర్ లీక్‌లో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయే పరిస్థితికి వచ్చింది. ప్రజలు ఏమైపోయినా పర్వాలేదు... కేసీఆర్‌కు డబ్బే ముఖ్యం. లిక్కర్ స్కామ్‌లో ఇతరులను అరెస్టు చేశారు కానీ... కవితను అరెస్టు చేయలేదు. కేసీఆర్ కుటుంబం బరితెగించింది. అందరికీ చుక్కలు చూపించే నా వరంగల్ వాసులను కూడా కేసీఆర్ మోసం చేశారు. వరంగల్ వాసులు కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలి. కేసీఆర్‌ను గద్దె దించాల్సిందే. ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వని స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యేను ఓడించాలి." అని విజయశాంతి పిలుపునిచ్చారు.

"సంక్షేమం అంటేనే కాంగ్రెస్. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్. బీజేపీ వాళ్లు సామదాన దండోపాయాలు ఉపయోగించి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తేవాలని చూస్తున్నారు. అవినీతి కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా బీజేపీ కాపాడుతోంది. బీఆర్ఎస్-బీజేపీ తోడు దొంగలు." అని విజయశాంతి విమర్శించారు.

# ప్రశ్నించడం తెలంగాణ రక్తంలోనే ఉంది



నిజామాబాద్ (వాయిస్ టుడే): ఎన్నికలు అనగానే ఒక బ్రమ్మ పదార్థం మాకు సంబంధం లేదు అనే ఆలోచన నుండి విద్యార్థులు బయటకు రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం విద్యార్థులు, కొత్త ఓటర్లలతో ఇంటరాక్షన్‌లో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఎన్నికలను ఆషామాశీగా తీసుకోవద్దన్నారు. యువతలో చైతన్యం రావాలన్నారు. స్వేచ్ఛ యుతంగా ఉండటం అనేది ముఖ్యమన్నారు. ఈరోజు ఉన్న స్వేచ్ఛ పోకుండా కాపాడుకోవాలని.. ప్రశ్నించటం తెలంగాణ రక్తంలోనే ఉందని చెప్పుకొచ్చారు. దేశానికి వ్యాపారం పేరుతో వచ్చిన ఆంగ్లేయులు దేశ ప్రజల స్వేచ్ఛను హరించారన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం ఇండియా అని అన్నారు.

# రాజేష్ పైలట్‌పై నేను వేసిన ప్రశ్నలకు కాంగ్రెస్ స్పందించట్లేదు: మోదీ

జైపూర్: రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ తండ్రి రాజేష్ పైలట్ పై తాను వేసిన ప్రశ్నలకు కాంగ్రెస్ స్పందించట్లేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ భిల్వారాలో జరిగిన బహిరంగ ర్యాలీని ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రాజేష్ పైలట్ ని కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకొని తరువాత పాలల్లో ఈగలా పక్కన పెట్టిందని ప్రధాని ఇటీవల ఆరోపించారు.

పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడారన్న కోపంతో తండ్రిపై శిక్ష విధించగా.. ఇప్పుడు సచిన్ పైలట్ కి కూడా అదే శిక్ష విధిస్తున్నారని.. కాంగ్రెస్ పార్టీ విధానాలను విమర్శించిన వారందరికీ ఇలాగే చేస్తారా అని ప్రశ్నించారు. తన ప్రశ్నలపై కాంగ్రెస్ సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆడుతున్న నాటకంలో సచిన్ పైలట్ బలిపశువు అవుతారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

"నిన్నటి నుంచి కాంగ్రెస్ రాజకుటుంబం నన్నే విమర్శిస్తోంది. రాజేష్ పైలట్‌ను ఎప్పుడూ అవమానించలేదని కాంగ్రెస్ అవాస్తవాలు మాట్లాడుతోంది. కానీ నేను లేవనెత్తిన ప్రశ్నకు పార్టీ నేతలు సమాధానం ఇవ్వడం లేదు. ఒక గుర్జర్ కుమారుడు(సచిన్ పైలట్) రాజకీయాల్లో తన మార్క్ చాటడానికి కష్టపడుతున్నారు. కాంగ్రెస్ కు తన జీవితాన్నిచ్చారు. ఆయన్ని ఉపయోగించుకున్న తరువాత కాంగ్రెస్ రాజకుటుంబం పాలలో ఈగలా మారుస్తుంది. ఆ పార్టీ నేతలు దివంగత రాజేష్ పైలట్‌తో కూడా అదే చేశారు. ఆయన కొడుకుతో కూడా అదే చేస్తున్నారు. రాజేష్ పైలట్ ప్రశ్నించడంతో ఆయన వైఖరి నచ్చక పక్కనపెట్టి.. ఇప్పుడు కుమారుడిపై కోపం తీర్చుకుంటున్నారు. మీకు కాంగ్రెస్(%జశీఅస్త్రతీవంం%) చరిత్ర తెలుసు. ఢిల్లీ హైకమాండ్ కారణంగా పార్టీలోని తప్పులకు వ్యతిరేకంగా స్వరం పెంచడానికి ఎవరు ప్రయత్నించినా రాజకీయంగా నష్టపోతారు. రాజేష్ పైలట్ ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. అది కూడా ఆ పార్టీ మంచి కోరి చేసిందే. కానీ పార్టీ ఇప్పటి వరకు సచిన్ పైలట్‌ను శిక్షిస్తోంది. తండ్రి మీద కోపంతో సచిన్ పైలట్ పట్ల ద్వేషపూరిత భావనతో ఉంది" ప్రధాని విమర్శించారు. రాష్ట్రంలోని 200 అసెంబ్లీ స్థానాల్లో 30-35 స్థానాల్లో



ఫలితాలను ప్రభావితం చేసే గుర్జర్ కమ్యూనిటీకి చెందిన పైలట్లు ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

### పచ్చి అబద్ధాలు..

రాజేష్ పైలట్, సచిన్ పైలట్ పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా మండిపడ్డారు. దివంగత మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల స్ఫూర్తితో రాజేష్ పైలట్ భారత వైమానిక దళాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ప్రధాని వ్యాఖ్యలపై స్పందించిన సచిన్ పైలట్.. తన తండ్రి జీవితమంతా కాంగ్రెస్ వాదిగా ఉన్నారన్నారు.

ప్రధాని వ్యాఖ్యలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని.. ఎన్నికల్లో ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీని ప్రధానమంత్రిగా ప్రకటించడంపై రాజేష్ పైలట్ అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేశారు. 1996లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి సీతారాం కేస్రీపై పోటీ చేసిన ఇద్దరు నేతలలో ఆయన కూడా ఒకరు. రాజేష్ పైలట్ 2000లో మరణించగా ఆయన కుమారుడు సచిన్ పైలట్ 2004లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2020లో రాజస్థాన్ కాంగ్రెస్ సర్కార్‌లో రాజకీయ సంక్షోభం వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో సచిన్ పైలట్, సీఎం అశోక్ గెహ్లాట్ మధ్య వైరం పెరిగిన పార్టీ అధిష్టానం చొరవతో సద్దుమణిగింది.



# మూడోసారి కేసీఆర్ గెలిస్తే ఢిల్లీ వచ్చి జెండా పాతుతారని వారిలో భయం పట్టుకుంది

నల్గొండ: మూడోసారి సీఎం కేసీఆర్ గెలిస్తే ఢిల్లీ వచ్చి జెండా పాతుతారని బీజేపీ, కాంగ్రెస్ జాతీయ స్థాయి నేతల్లో భయం పట్టుకుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు వ్యాఖ్యానించారు. గురువారం నాడు నల్గొండ జిల్లాలోని దేవరకొండలో కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..."గతంలో దేవరకొండ అంటే పసిపిల్లని అమ్ముకునేదిగా ఉండేది...ఈరోజు దేవరకొండ అంటే 100 కోట్ల అభివృద్ధి కనపడుతుంది. తొమ్మిదిన్నరేళ్లలో 12 వేల కోట్లతో దేవరకొండని కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఛాన్స్ కాదు ఎన్ని 11 ఛాన్సులు ఇచ్చినా తెలంగాణలో అభివృద్ధి ఏమీ చేయలేదు. ఢిల్లీ పార్టీ వాళ్లు మామూలు వాళ్లు కాదు దేశముదుర్లు. ఢిల్లీ నుంచి గుంపులు గుంపులుగా వస్తున్నారు జాగ్రత్తగా ఉండాలి" అని కేటీఆర్ సూచించారు.